
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

బుధవారం 24 జూలై 2024

షేర్‌మార్కెట్‌లో లాభాలంటూ
రూ.కోటికి కుచ్చుటోపీ
● పోలీసులకు ఫిర్యాదుతో రూ.24 లక్షలు రికవరీ
యువతికి తెలియకుండానే పర్సనల్ లోన్
ముదిరిన వివాదం.. కబేళాకు తాళం
7 లో

కింది బజార్ మహబూబ్‌సాగర్ చెరువు అభివృద్ధికి రూ.500 కోట్లు



టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

● సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 23: సంగారెడ్డి పట్టణంలోని కింది బజార్ మహబూబ్‌సాగర్ చెరువు అభివృద్ధి కోసం రూ.500 కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి తెలిపారు. ఈ నిధులతో మహబూబ్‌సాగర్ సుందరీకరణతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. వీటిలో ప్రధానంగా అభివృద్ధి చేసే పనుల వివరాలిలా ఉన్నాయి.

1. మహబూబ్‌సాగర్ చెరువు కట్ట వెడల్పుతో పాటు చెరువు చుట్టూ నెక్లెస్ రోడ్డు ఏర్పాటు.
2. చెరువు మధ్యలో భారీ శివుడి విగ్రహం, చెరువు కట్ట వద్ద చిన్న పిల్లల పార్కు.
3. చెరువు కట్టపై వాకింగ్‌ట్రాక్, బతుకమ్మలు వదలడానికి అదనంగా మెట్ల నిర్మాణం.
4. చెరువు వద్ద ప్రత్యేకంగా హోటళ్లు, చెరువులో బోటింగ్ సౌకర్యం.
5. మురుగు నీటి తొలగింపుతో పాటు చెరువులోకి వచ్చే మురికి నీటిని తరలించేందుకు ప్రత్యేక కాల్వల నిర్మాణం.
6. చెరువు మధ్యలో ఉన్న సోమేశ్వరవాడ శివాలయం అభివృద్ధి.
7. చెరువు కట్టమీద ఉన్న చాకలి వారి మడేలమ్మ, బెస్తవారి మైసమ్మ గుడి, గాలి పోచమ్మ గుడితో పాటు షాదుల్లాహుస్సేన్ దర్గా అభివృద్ధి.
8. చెరువు కట్ట కింద ఉన్న కింది బజార్ మల్లన్న గుడి, బీరప్ప ఆలయాల అభివృద్ధి.
9. నెక్లెస్ రోడ్డు చుట్టూ 12 కిలోమీటర్ల మేర విద్యుద్దీపాల ఏర్పాటు.
10. నెక్లెస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న కల్యాకుంట రైతులకు, మల్లన్న, బీరప్ప ఆలయాల కోసం భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం చెల్లింపు.
11. కల్యాకుంట, నాల్సాబ్‌గడ్డ, రిక్షాకాలనీ, సోమేశ్వరవాడల మీదుగా నెక్లెస్ రోడ్డుపై పార్కుల ఏర్పాటు.
12. చెరువు కట్టపై తూము దగ్గర బ్రిడ్జిలతో పాటు కాల్వల నిర్మాణం చేపట్టనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలిగితే హిస్టరీ షీట్ క్లోజ్ : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జూలై 23 : జిల్లాలోని రౌడీలు, కేడీలు సత్ప్రవర్తనతో మెలిగితే హిస్టరీ షీట్‌క్లోజ్ చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. సంగారెడ్డిలోని పోలీసు కల్యాణ మండపంలో మంగళవారం పటాన్‌చెరు సబ్ డివిజన్‌కు చెందిన హిస్టరీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. గంజాయి సాగు చేసినా, నిల్వ చేసినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ రూపేష్ హెచ్చరించారు.



హిస్టరీ షీటర్లతో మాట్లాడుతున్నఎస్పీ రూపేష్

బోనాల ఉత్సవాల్లో జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి, జయారెడ్డి



సంగారెడ్డిలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో జోగిని శ్యామలతో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి



సంగారెడ్డిలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాలి

ప్రమాదాల నివారణ చర్యలపై హైవే అథారిటీ అధికారులతో చర్చిస్తాం : మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



నిజాంపేట పోలీస్‌స్టేషన్‌లో మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

రామాయంపేట/నిజాంపేట, జూలై 23: సైబర్ మోసాలు, మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. రామాయంపేట, నిజాంపేట పోలీస్‌స్టేషన్లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, కేసుల గురించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. వాహనాలు తనిఖీలను క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా పరిధిలోని హైవేలపై రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై హైవేఅథారిటీ ఉన్నతాధికారులతో చర్చిస్తామని వెల్లడించారు. తరచుగా ప్రమాదాలు జరిగే జంక్షన్ల వద్ద బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాని చెప్పారు. దొంగతనాలను అరికట్టేందుకు రాత్రివేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామని చెప్పారు. గంజాయి అక్రమ రవాణాపై నిఘా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ వెంకటరాజుగౌడ్ ఎస్సై శ్రీనివాసరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, రైటర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ.. నిరాశ..

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ.. రైతులు, నిరుద్యోగుల బడ్జెట్‌గా అభివర్ణిస్తోంది. విపక్షాలు మాత్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపించారని అంటున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తారని ప్రజలు ఆశించగా, ఎలాంటి ప్రకటనా విడుదల కాలేదు. ఉమ్మడి జిల్లాలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలనూ పట్టించుకోలేదు. బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేయడం, ఉపాధి కల్పనపై దృష్టి పెట్టడంతో సానుకూలత వ్యక్తమవుతోంది. ఆదాయపన్ను సవరింపుతో వేతన జీవులకు ఊరట లభించింది.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం చేశారు. బీజేపీ, మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ప్రాధాన్యమిచ్చారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను విస్మరించారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు.

-నిర్మలా జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్

రాజకీయ లక్ష్యాల మేరకే బడ్జెట్



కేంద్ర బడ్జెట్ బీజేపీ రాజకీయ లక్ష్యాలమేరకే ఉంది. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉండి కూడా తెలంగాణకు నిధులు తేలేకపోయారు. జాతీయ పార్టీలకు రాష్ట్రంలో 16 ఎంపీ స్థానాలు ఇస్తే రాష్ట్రానికేం చేయలేదు.

-చింతా ప్రభాకర్, సంగారెడ్డి ఎమ్మెల్యే

పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేలా ఉంది. మహిళలు, యువతకు సముచిత ప్రాధాన్యమిచ్చారన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉద్యోగకల్పన, స్వయం ఉపాధికి పెద్దపీట వేశారు. తెలంగాణ అభివృద్ధికి ఊతమిచ్చేలా బడ్జెట్ ఉంది.

-గోదావరి అంజిరెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు

కార్మికులకు ఉపయోగపడేలా కేంద్ర బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక రంగానికి మేలు చేసేలా ఉంది. సంవత్సరానికి కోటి మందికి ఉద్యోగాలు, వంద నగరాల్లో పారిశ్రామిక పార్కులు, పారిశ్రామిక అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం. నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేశారు. పన్ను రాయితీని పెంచకపోవడం నిరాశపర్చింది.

-పి.మోహన్‌రెడ్డి, బీఎంఎస్ జిల్లా కార్యదర్శి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపించింది. ఆహార భద్రతను గాలికి వదిలేశారు. ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చారు. పేదలకు రాయితీలు తొలగించి, కార్పొరేట్ వ్యాపారులకు రాయితీలు ప్రకటించారు. పేదలకిచ్చే ఆహార సబ్సిడీకి కేటాయింపులు తగ్గించారు.

-మాణిక్యం, సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు

విద్యారంగానికి నిరాశ



కేంద్రం బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించింది. 2.66 శాతం నిధులనే కేటాయించడం నాణ్యమైన విద్యను దూరం చేయడంతోపాటు ప్రైవేటీకరణను ప్రోత్సహించేలా ఉంది.

-సంగయ్య, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగవర్గాలకు నిరాశపర్చిన బడ్జెట్



కేంద్ర బడ్జెట్ ఉద్యోగవర్గాలను నిరాశపర్చింది. ఆదాయ పన్ను పాత విధానంలో మార్పులు చేయకపోడంతో వేతన జీవులకు పెద్దగా లాభం జరగలేదు. రూ. 3 లక్షల వరకు జీరో పన్ను, స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 నుంచి రూ.75 వేలకు పెంచడం కొంత ఊరట కలిగించింది.

-మల్లారెడ్డి, ఉపాధ్యాయుడు

నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్‌కు ప్రత్యేకాధికారి గ్రామానికి వచ్చిన దాఖలాలు లేవని గ్రామస్థులు చెబుతున్నారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో గంగాపూర్ కార్యదర్శిని ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో, పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. వీధి దీపాలు వెలగడం లేదు. వర్షాలు కురుస్తుండడంతో సమస్యలు పెరిగిపోయాయి.

సంగారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న కంది మండలం తోపుగొండ గ్రామంలో పారిశుధ్య సమస్య నెలకొన్నది. ఎక్కడపడితే అక్కడ చెత్తను పడేస్తున్నారు. గ్రామాన్ని ప్రత్యేకాధికారి పట్టించుకోవడం లేదని, కార్యదర్శి అంతంతగానే పర్యవేక్షిస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేస్తున్నారు.

'మెదక్ జిల్లా తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో చెత్త సేకరించడానికి నిధుల కొరత అడ్డొస్తున్నది. పంచాయతీ ట్రాక్టర్‌లో డీజిల్ పోయించడానికి డబ్బులు లేక వారానికి ఒకట్రెండు సార్లు మాత్రమే చెత్తను సేకరిస్తున్నారు. సర్పంచ్‌లు లేక.. సమస్యలు చెప్పుకుందామంటే ప్రత్యేకాధికారి రాక.. ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు.

పల్లెపై పట్టింపేదీ?

అడ్రస్ లేని స్పెషల్ ఆఫీసర్లు

బాధ్యతగా కొందరు.. భారంగా ఇంకొందరు

గ్రామాలవైపు కన్నెత్తిచూడని పలువురు..

పారిశుధ్యం, నీటి సరఫరా అస్తవ్యస్తం

వ్యాధులు వ్యాపిస్తున్నా చర్యలు శూన్యం



కోహీర్‌లోని లాల్‌సాబ్ వీధిలో ప్రవహిస్తున్న మురుగు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 23: పల్లెల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. దీనికితోడు నిధుల కొరతతో కనీస మరమ్మతులు కూడా చేయించలేని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ ఖజానాల్లో నిధుల సమస్య వల్ల కార్మికులకు నెలల తరబడిగా వేతనాలు ఇవ్వడం లేదు. ఇక చెత్త సేకరించడానికి వినియోగించే ట్రాక్టర్లలో డీజిల్ నింపలేని దుస్థితి పలుచోట్ల నెలకొంది.

పల్లెను చూడని ప్రత్యేకాధికారి

మెదక్ జిల్లాలో 469 గ్రామపంచాయతీలు, సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఫిబ్రవరి నెల నుంచి ఈ గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. మండల, డివిజన్ స్థాయి అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తమ మాతృశాఖలతోపాటు ప్రత్యేకాధికారులుగా పల్లెలను సైతం పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చారు. కానీ చాలామంది అధికారులు పల్లెలను పట్టించుకోవడం లేదు. వారానికో సారి కూడా గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. కనీస అవసరాలకు సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిధుల కొరత కారణంగా గ్రామంలో తప్పనిసరిగా చేపట్టాల్సిన పనులకు పంచాయతీ కార్యదర్శులు సొంతంగా డబ్బులు వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరునెలలుగా ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ వారి ముద్ర కానరావడం లేదు.

సీజనల్ రోగాలకు ఆజ్యం

అపరిశుభ్రత కారణంగా వ్యాధులు విజృంభిస్తాయి. అందుకే వానాకాలం రాగానే పల్లెలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తారు. మురికికాలువలు, ఇళ్ల సమీపాల్లో చెత్తాచెదారం నిల్వ ఉండడంతో దోమలు ప్రబలుతున్నాయి. వర్షపునీటిని సైతం దారిమళ్లించే ప్రయత్నాలు జరగడం లేదు. మూడు రోజులుగా ముసురు అలుముకున్నా గ్రామాల్లో రక్షణ చర్యలు చేపట్టలేదు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉండగా.. ఆ ధాఖలాలు లేవు. తాగునీటి సరఫరాలోనూ సరైన చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పలు గ్రామాల్లో అడ్డగోలుగా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. కనీసం ఈ వర్షాకాలం ముగిసేవరకైనా ప్రత్యేకాధికారులు పర్యవేక్షించేలా జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించాల్సిన అవసరాలు ఎంతైనా ఉన్నాయి.



కంది మండలం తోపుగొండలో చెత్త కుప్ప



గుమ్మడిదలలో వాటర్‌ప్లాంట్ వద్ద నిలిచిన మురుగు



రాయికోడ్‌లో అంతర్గత రహదారిపై మురుగు ప్రవాహం



నారాయణఖేడ్ నిజాంపేటలో మురికికాల్వలో పందుల విహారం

మాకొద్దీ కంపు.. డంపు..

కాలుష్యంతోనే చస్తున్నాం.. కొత్తగా డంపింగ్‌యార్డా ? గుండ్లమాచునూర్ గ్రామస్థుల ఆందోళన



డంపుయార్డు ఏర్పాటు వద్దని ఆందోళన చేస్తున్న గుండ్లమాచూనూర్ గ్రామస్థులు

హత్నూర, జూలై 23: 'పరిశ్రమల కాలుష్యంతోనే గ్రామంలో ఉండలేకపోతున్నాం.. విష వాయువులతో వ్యాధుల బారినపడుతున్నాం.. అది చాలదన్నట్టు డంపుయార్డు ఏర్పాటు చేసి మా ప్రాణాలు తీస్తారా'.. అని గుండ్లమాచనూర్ గ్రామస్థులు మండిపడ్డారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ప్రాణం పోయినా డంపుయార్డును ఏర్పాటు చేయనీయమని స్పష్టంచేశారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో వెలువడిన చెత్తను డంప్ చేయడం కోసం సంగారెడ్డి జిల్లా కంది మండలం ఆరుట్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 133లో డంపుయార్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ ప్రదేశం హత్నూర మండలం గుండ్లమాచూనూర్ గ్రామం పక్కనే ఉండడంతో గ్రామస్థులు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం సంగారెడ్డి మున్సిపాలిటీ సిబ్బంది జేసీబీ, ట్రాక్టర్లతో గుండ్లమాచూనూర్ మీదుగా డంపుయార్డు వద్దకు వెళ్తుండగా అడ్డుకొని తిప్పిపంపారు. కంది తహసీల్దార్ విజయలక్ష్మి, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ చౌహన్ ప్రసాద్, డిప్యూటీ ఈఈ ఇంతియాజ్, హత్నూర తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినలేదు. రసాయన పరిశ్రమల కాలుష్యంతోనే నీరు.. గాలి కలుషితమై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నామని, డంపింగ్‌యార్డుతో బతుకులు నరకమవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు.

'ఫార్మా, రసాయన పరిశ్రమలను తరలించాలి'

పంజాగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఐడీఏ ఖాజీపల్లిలో కాలుష్యం వెదజల్లుతున్న ఫార్మా, రసాయన పరిశ్రమలను తరలించాలని ఖాజీపల్లి గ్రామ జేఏసీ చైర్మన్ రమాకాంత్ దండే డిమాండ్ చేశారు. హీరో ప్రభాస్ దత్తత తీసుకున్న అటవీ ప్రాంతం తమ గ్రామ పరిధిలో ఉన్నదన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు మహేష్ మాట్లాడారు.

దత్తత తీసుకున్న అమ్మాయిని బాగా చదివించాలి

● సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దంపతులకు ఆడ శిశువును దత్తతగా ఇస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 23: దత్తత తీసుకున్న అమ్మాయిని బాగా చదివించాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో మంగళవారం ఆడ శిశువును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లాకు చెందిన దంపతులకు అదనపు కలెక్టర్ అధికారికంగా దత్తతగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె అమ్మాయిని బాగా చదివించాలని, తనకు ఇష్టమైన రంగంలో ప్రోత్సాహం ఇవ్వాలని, అమ్మాయి బంగారు భవిష్యత్‌కు బాటవేసే పూర్తి బాధ్యత మీదనని తెలిపారు. జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని, తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, బాల రక్ష భవన్ కో ఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, శిశు గృహ మేనేజర్ ఝాన్సీ, శిశుగృహ సామాజిక కార్యకర్త రాజారామ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట స్టీల్ బ్యాంక్ గుర్తింపు హరీశ్‌రావుకే దక్కుతుంది



సమావేశంలో విజయ సంకేతం చూపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, తదితరులు

సిద్దిపేట టౌన్, జూలై 23: జాతీయస్థాయిలో సిద్దిపేట స్టీల్ బ్యాంక్‌కు గుర్తింపు రావడం ఆనందంగా ఉన్నదని, ఆ గుర్తింపు ఘనత మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకే దక్కుతుందని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మలు వేర్వురుగా జరిగిన సమావేశంలో తెలిపారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రోజాశర్మ, మున్సిపల్ కార్యాలయంలో మంజులారాజనర్సులు మాట్లాడుతూ ప్రతి ఏడాది కేంద్రం వెలువరించే పార్లమెంట్ ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా బుక్‌లో సిద్దిపేట స్టీల్ బ్యాంక్ ప్రస్తావన రావడం గర్వంగా ఉన్నదన్నారు. సిద్దిపేట పట్టణం సుమారు 1.57 లక్షల జనాభాను కలిగి ఉన్నదని, పట్టణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు ఆలోచనతో దానిని నివారించేందుకు హరీశ్‌రావు స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేశారని వివరించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు, నాటి సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, బాలవికాస సంస్థ సహకారంతో మొదట సిద్దిపేటలోని 4వ వార్డులో స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. హరీశ్‌రావు సూచన మేరకు అన్నివార్డులతో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో స్టీల్ బ్యాంకులను ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు గోపాలపురం దీప్తినాగరాజు, గ్యాదరి రవి, ధర్మవరం బ్రహ్మం, పసకుల సతీష్, మోయిద్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణశర్మ, పాల సాయిరాం, మోహన్‌లాల్, భూపేశ్, ఎడ్ల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాగుదామిలా..

● పంటల రక్షణకు యాజమాన్య పద్ధతులు
● స్వల్పకాలిక రకాలు మేలు
● తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి

సిద్దిపేట రూరల్, జూలై 23: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నుంచి పంటల సంరక్షణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీదేవి తెలిపారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పంట పొలం నుంచి మురుగునీటిని తీసివేయాలని చెప్పారు. రాబోయే మూడురోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారీ చేయడం తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని చెప్పారు.

వరి పంటలో..

నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో రైతులు స్వల్పకాలిక (120-125 రోజుల) వరి రకాల నారుమళ్లు జూలై 31వ తేదీవరకు పోసుకోవడానికి అనువైన సమయం ఉంటుంది. 30 నుంచి 25 రోజుల వయస్సు ఉన్న మధ్యకాలిక, స్వల్పకాలిక వరి రకాలను నాటు వేసుకోవాలి. దీర్ఘకాలిక వరి రకాల నారు బాగా ముదిరి (50 రోజుల వయస్సు) ఆలస్యంగా నాటినప్పుడు ఆకు చివరలను తుంచి వేసి కుదురుల సంఖ్యను పెంచి కుదురుకు 6 నుంచి 8 మొక్కల చొప్పున నాటువేయాలి. నత్రజని ఎరువులను సిఫారసు కంటే 25 శాతం పెంచి మూడుదఫాలుగా, రెండు దఫాలుగా అంటే 70 శాతం నాటే సమయంలో మిగతా 30 శాతం అంకురం దశలో వేసుకోవాలి. వరినాట్లు వేసుకునే వారంరోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను ఇసుకలో కలిపి చల్లినట్లయితే ప్రధాన పొలంలో పంటను 15-20 రోజుల వరకు కొన్నిరకాల పురుగుల నుంచి కాపాడుకోవచ్చు. ఇప్పటివరకు నార్లు పోయని రైతాంగం, వర్షాలను సద్వినియోగం చేసుకుని పొలాలను దమ్ము చేసి వరి పంటను నేరుగా విత్తే పద్ధతిలో విత్తుకోవడం వల్ల సమయంతో పాటు పెట్టుబడి ఆదా చేసుకోవచ్చు. వరినాటు పెట్టిన తర్వాత ప్రతి 2 మీటర్లకు కాలిబాటను తీయటం వల్ల గాలి వెలుతురు బాగా ప్రసరించడంతో పాటు సుడిదోమ ఉధృతిని నివారించవచ్చు. అదేవిధంగా రైతులు ఎరువులు, పురుగు మందులు పంటకు అందించడానికి సులువుగా ఉంటుంది. ముందస్తు చర్య నివారణలో భాగంగా ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను నాటిన 10 నుంచి 15 రోజుల మధ్య వేసుకోవడం ద్వారా కాండం తొలుచు పురుగు, ఉల్లి కోడును నివారించుకోవచ్చని తెలిపారు.



జొన్న పంటలో..

ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా జొన్న పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు, పంట విత్తిన 30-35 రోజుల దశలో ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను కాండము సుడులలో వేయాలన్నారు.

కంది పంటలో..



ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటలో ఫైటాప్తోర ఎండుతెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు గమనించినచో, నివారణకు 2 గ్రా. మెటలాక్సిల్ మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలని సూచించారు.



వేరుశనగ పంటలో..

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వేరుశనగలో మొదలుకుళ్లు తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు మొక్కల మొదళ్ల దగ్గర 2 గ్రాముల కార్బండజిమ్+మ్యాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి నేలను తడపాలి.

పత్తి పంటలో..



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన తరువాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రసాయనిక ఎరువులను 20 రోజుల నుంచి 40 రోజుల వయసున్న పంటకు మొక్కల మొదళ్లలో 7-10 సెం. మీ దూరంలో పాదులుతీసి వేసి మట్టితో కప్పాలి. ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 లేదా 13-0-45 లేదా 10 గ్రా. యూరియా లీటరు నీటికి కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను నివారించుటకు 3 గ్రా. కాపర్-ఆక్సీ-క్లోరైడ్ లేదా 2 గ్రా. కార్బెండజిమ్+మ్యాంకోజెబ్ శిలీంద్రనాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్టు వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పత్తి పంటలో వచ్చే గడ్డి జాతి, వెడల్పాకు కలుపు మొక్కలను నివారించడానికి (2 నుంచి 3 ఆకుల దశలో ఉన్న కలుపు మొక్కలు) 2 మి.లీ. క్విజలోఫాప్ ఇథైల్+1.25 మి.లీ. పైరిథాయోబ్యాక్ సోడియం కలుపు మందులను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.



మొక్కజొన్న పంటలో..

మొక్కజొన్న శాకీయ దశలో ఎక్కువ నీటిని తట్టుకోలేదు. కాబట్టి పొలం నుంచి నీటిని తీసివేయాలి. అధిక వర్షాల వల్ల నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఊదారంగులోకి మారే అవకాశం ఉంటుంది. వర్షాలు నిలిచిన తర్వాత 5 గ్రా. 19-19-19 లేదా 20 గ్రాముల డీఏపీ మందును లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. మొక్కజొన్న పంటను జూలై 31వ తేదీవరకు స్వల్పకాలిక రకాలను దిగుబడిలో ఎటువంటి తరుగుదల లేకుండా విత్తుకొనుటకు అనుకూల సమయం. మోకాలు ఎత్తు దశలో ఉన్న పైరులో ఒక కిలో సున్నం, 9 కిలోల ఇసుకను కలిపి మొక్క సుడులలో వేసి కత్తెర పురుగును నివారించుకోవచ్చు. వర్షాలు తగ్గిన తర్వాత వర్షాధార పంటకు పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను వేసుకోవాలని చెప్పారు.

చెరకు పంటలో..



ముంపుకు గురైయ్యే ప్రాంతాల్లో ప్రతీ 25 మీటర్లకు ఊట కాలువలు ఏర్పాటు చేసుకుని తోటలో నీరు నిలువకుండా మురుగునీటి కాలువల ద్వారా నీటిని తీసివేయాలి. రైతులు వర్షాలు పడుతున్న సందర్భంలో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంట రక్షణతో పాటు అధిక అధిక దిగుబడి సాధించవచ్చునని చెప్పారు. రైతులు పూర్తి వివరాలకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం తోర్నాల సంప్రదించాలని, పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు రైతులు సందేహాలు తెలిపితే నివారణ మార్గాలను సూచిస్తారని తెలిపారు.

కూరగాయల సాగులో..



టమాట, వంగ, మిరప, బంతి పంటల నారుమళ్లలో నారు కుళ్లు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్-ఆక్సీ-క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి నేల పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కూరగాయల పంటల్లో ఆకుమచ్చ తెగులు సోకుటకు అనుకూలం. తెగులు నివారణకు 3 గ్రా. కార్బెండజిమ్ లేదా 1మి.లీ. ప్రోపికోనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.



సోయాచిక్కుడు పంటలో..

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటలో వేరుకుళ్లు తెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు గమనించినచో, నివారణకు 3 గ్రా. కాపర్-ఆక్సీ-క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. సోయాచిక్కుడు పంటలో కాండం కుళ్లు తెగులు గమనించినట్లయితే 2.5గ్రా కార్బండాజిమ్+మ్యాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల వల్ల 25 రోజుల పంటలో అంతరకృషి చేయడం వీలుకాని చోట 250మి.లీ. ఇమాజితాపిర్ 10శాతంఎస్ఎల్ లేదా 40గ్రా. ఇమాజితాపిర్+ఇమాజమాక్స్ కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసి గడ్డి, వేడల్పాకు కలుపు జాతి మొక్కలను నివారించాలన్నారు.

భూమి విషయంలో అధికార పార్టీ నేతల దౌర్జన్యం

● న్యాయం చేయాలని జిల్లా ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

మెదక్ అర్బన్, జూలై 23: పంట భూమి విషయంలో అధికార పార్టీకి చెందిన నేతల తమపై దౌర్జన్యం చేస్తూ దాడిచేశారని తమకు న్యాయం చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి బాధితులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు రమావత్ బుజ్జి, శంకర్, యమునా, అనిల్ మాట్లాడుతూ.. టేక్మాల్ మండల పరిధి షాబాద్‌తండాలోని సర్వేనెంబర్ 86లో 360 ఎకరాల అటవీ భూమి ఉందన్నారు. ఇందులో 150 ఎకరాల భూమికి పట్టాలు ఇవ్వగా.. మిగతా భూమిని గిరిజనులకు పోడు వ్యవసాయం కింద సాగు చేసుకుంటున్నామన్నారు. అధికార పార్టీకి చెందిన సేవాలాల్, ప్రకాష్, దినేష్ మా భూమిలో హద్దులను చెరిపేస్తుంటే అడ్డుకున్నామన్నారు. దాంతో మాపై గొడ్డలి, కట్టెలతో దాడిచేసి చంపే ప్రయత్నం చేశారని, మహిళలు అని చూడకుండా దూషిస్తూ కొట్టారని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోకుండా తమపైనే కేసులు నమోదు చేశారని తెలిపారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఎస్పీని కోరిన్నట్లు బాధితులు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే

అధికార పార్టీల నేతల దాడిలో గాయపడి మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పరామర్శించి మాట్లాడారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపించారు. వెంటనే దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీని కోరినట్లు ఆయన తెలిపారు.



పొంగి పొర్లుతున్న ఘనపురం

పాపన్నపేట, జూలై 23: ఇటీవల కురిసిన వర్షాలతో మంజీరా నదికి వరదలు పోటెత్తాయి. పరవళ్ల తొక్కుతున్న మంజీరా ఘనపురం ప్రాజెక్టును చేరింది. మంగళవారం ఉదయం నుంచి ఆనకట్ట పొంగిపొర్లుతూ దుర్గమ్మ ఆలయం ముందు నుంచి దిగువకు ప్రవహిస్తుంది. ఆయకట్టు పరిధిలోని సుమారు వేల ఎకరాల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

యంత్రంతో వరినాట్లు

● కూలీలు దొరక్కపోవడంతో యంత్రాల వైపు రైతుల మొగ్గు
● ఖర్చు తక్కువ.. సమయం ఆదా



అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో యంత్రంతో వరి నాట్లు వేస్తున్న రైతులు

అక్కన్నపేట, జూలై 23: వానాకాలంలో వరి సాగుచేసేందుకు ముందుకొచ్చిన అన్నదాతలకు నాట్ల సమయంలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో సమయానికి నాట్లు వేయక దిగుబడి తగ్గుతున్నది. ఈ నేపథ్యంలో కొందరు రైతులు వ్యవసాయ యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ సీజన్‌లో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో యంత్రం సాయంతో వరినాట్లు వేస్తున్నారు. మంగళవారం మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో వరి యంత్రంతో రైతులు నాట్లు వేశారు. వరినాటు యంత్రంతో నాట్లు వేస్తే ఎకరానికి రూ.4 వేలు తీసుకుంటున్నారు. అదే కూలీలతో నాట్లు వేస్తే ఎకరానికి రూ.6 వేల ఖర్చు వస్తుంది. దీంతో ఎకరానికి రూ.2 వేల వరకు ఖర్చు తగ్గుతుందని, సమయం కూడా ఆదా అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. కూలీల కొరతను అధిగమించి సరైన సమయానికి నాట్లు వేయొచ్చని చెబుతున్నారు.

కూలీలు దొరక్కపోవడంతో..

కూలీలు దొరక్కపోవడంతో యంత్రంతో వరినాటు వేయించాను. సమయం ఆదాతో పాటు.. ఖర్చు తక్కువగా అవుతుంది. యంత్రంతో నాటు వేస్తే రూ.4 వేలు అవుతుండగా.. కూలీలతో వేయిస్తే రూ.6 వేలు వరకు అవుతుంది. యంత్రంతో నాలుగు ఎకరాలు నాటు వేయించాను.

\- పీచర వెంకటేశ్వరరావు, రైతు, గోవర్ధనగిరి

బాలురతో సమానంగా బాలికలకూ హక్కులు

● లింగనిర్ధారణ పరీక్షలు జరగకుండా అంగన్‌వాడీలు చూడాలి
● జిల్లా సీనియర్ న్యాయాధికారి రమేశ్



మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా సీనియర్ న్యాయాధికారి రమేశ్

జోగిపేట, జూలై 23: సమాజంలో బాలురతో సమానంగా బాలికలకూ హక్కులుంటాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సంగారెడ్డి జిల్లా సీనియర్ న్యాయాధికారి రమేశ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్తాధ్వర్యంలో మిషన్ శక్తి-100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ మనోజ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం.. బాల బాలికలంతా సమానమేనన్నారు. బాలురతో పాటు బాలికలకూ సమాన హక్కులుంటాయని వివరించారు. ఈ హక్కులపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. అలాగే లింగ నిర్ధారణ జరిపే పరీక్షలను నిలువరించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉన్నదని చెప్పారు. అనంతరం అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల పిల్లల ఆరోగ్యం, విద్య విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. పోక్సో చట్టం గురించి కిశోర బాలికలకు, అవగాహన కల్పించి, వారిని చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి లలితకుమారి, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, సీడీపీవో ప్రియాంక, ఎంపీడీవో రాజేశ్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

షేర్‌మార్కెట్‌లో లాభాలంటూ రూ.కోటికి కుచ్చుటోపీ

● పోలీసులకు ఫిర్యాదుతో రూ.24 లక్షలు రికవరీ
● పటాన్‌చెరులో సైబర్ నేరం

పటాన్‌చెరు, జూలై 23: షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే లాభాల వర్షం కురుస్తుందన్న సైబర్ నేరగాళ్ల మాయమాటలకు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఏకంగా రూ.కోటి పోగొట్టుకున్నాడు. సకాలంలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అందులో రూ.24 లక్షలు రికవరీ చేయగలిగారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో వెలుగు చూసిన ఈ సైబర్ నేరం వివరాలు పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. పట్టణ శివారులోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉండే బెజవాడ నాగార్జున (36) బెంగళూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో చిన్నమొత్తాలను పెట్టుబడులుగా పెట్టి, లాభాలు పొందడం అతనికి అలవాటు. జూలై 5న నాడియాకమీ అనే గుర్తుతెలియని మహిళ.. నాగార్జున వాట్సాప్‌కు షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే పెద్ద ఎత్తున లాభాలు వస్తాయని మేసేజ్ పంపించింది. పెట్టుబడులు పెట్టాల్సిన సంస్థలను తాము సూచిస్తామని లాభాలు తెచ్చిపెట్టే బాధ్యత తమదని నమ్మించింది. దీంతో బెజవాడ నాగార్జున వారు సూచించిన యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాడు. పలు దఫాలుగా చిన్న మొత్తాలను పెట్టుబడి పెట్టి లాభాలు పొందాడు. నమ్మకం కుదిరిన తరువాత ఏకంగా రూ.99,78,527లు పలు యాప్‌ల ద్వారా పెట్టుబడుల రూపంలో బదిలీ చేశాడు. అయితే, వచ్చిన లాభాలు తన బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడాన్ని గమనించిన నాగార్జున మోసపోయానని గ్రహించాడు. సోమవారం అర్థరాత్రి పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. వారు వెంటనే సైబర్ క్రైం సెల్ 1930కి ఫోన్ చేయడంతో సైబర్ నేరగాళ్ల అకౌంట్‌లలో బదిలీ కాకుండా ఉన్న రూ. 24 లక్షలను రికవరీ చేశారు.

యువతికి తెలియకుండానే పర్సనల్ లోన్

● రూ.5 లక్షలు నొక్కేసిన సైబర్ నేరగాళ్లు

తూప్రాన్, జూలై 23: ఆమెకు తెలియకుండానే సైబర్ నేరగాళ్లు పర్సనల్ లోన్ తీసుకుని, అందులో నుంచి రూ.5 లక్షలు కాజేసిన ఉదంతం తూప్రాన్‌లో సోమవారం వెలుగు చూసింది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణంలో నివాసముండే ఓ యువతికి మొబైల్‌కు ఫోన్ చేసి ఇంటర్నేషనల్ కొరియర్ వచ్చిందని చెప్పారు. తాను ఎలాంటి కొరియర్ బుక్ చేయలేదని, ఆ కొరియర్ తనది కాదని చెప్పింది. కొరియర్ మీది కాకుంటే ఒకటి నొక్కడంటూ చెప్పడంతో ఆమె నమ్మి వారు చెప్పినట్లు చేసింది. ఆ తర్వాత సైబర్ క్రైం బ్యూరో అంటూ కాల్ చేసి కొరియర్ గురించి మాట్లాడితే తనది కాదంటూ కాల్ కట్ చేసింది. అయితే, మొదటిసారి కాల్ చేసినప్పుడే ఆమె వివరాలు సేకరించిన సైబర్ దొంగలు.. ఐసీఐసీఐ నుంచి ఆమె పేరిట రూ.6 లక్షల పర్సనల్ లోన్ తీసుకున్నారు. తర్వాత స్కైప్ వీడియో కాల్ చేసి ఐసీఐసీఐ బ్యాంక్ వెరిఫికేషన్ అంటూ ఆమె బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్‌కార్డు వివరాలు చెప్పారు. అవన్నీ తనవే కావడంతో ఆమె అయోమయానికి గురైంది. తర్వాత అవతలి వారు మీ బ్యాంక్ ఖాతాలో రూ.6 లక్షలు వచ్చాయి, చెక్ చేసుకోమని సూచించారు. దీంతో ఆ యువతి తన మొబైల్‌లో బ్యాంక్ యాప్ ఓపెన్ చేయగా.. ఫోన్ పని చేయలేదు. వెంటనే బ్యాంక్‌కు వెళ్లి వివరాలు పరిశీలించగా, తనకు తెలియకుండానే రూ.6 లక్షల రుణం తీసుకున్నట్లు, అందులో రూ.5 లక్షలు బదిలీ జరిగినట్లు ఉంది. దీంతో ఆమె సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముదిరిన వివాదం.. కబేళాకు తాళం

● ఏడుపాయల్లో ఉద్రిక్తత



ఏడుపాయల కబేళాకు తాళం వేస్తున్న ఈవో, ఎస్ఐ

పాపన్నపేట, జూలై 23: పాపన్నపేట కబేళా వివాదం చివరకు గేటుకు తాళం పడే పరిస్థితికి దారితీసింది. కబేళా కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించడంతో ఈవో క్రిష్ణప్రసాద్, ఎస్ఐ నరేష్ కలిసి గేటుకు తాళం వేసిన సంఘటన మంగళవారం జరిగింది. తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయల్లో జంతు బలి నిషేధం ఉంది. కానీ వేలాది భక్తులు అనునిత్యం మేకలు, గొర్రెలు కోసుకుంటూ విందులు చేసుకుంటారు. దీంతో ఆలయానికి కొంత ఆదాయం సమకూర్చాలని, పరిసరాల పారిశుధ్యం కాపాడాలని యోచించిన అప్పటి పాలకవర్గ చైర్మన్, నాటి ప్రజాప్రతినిధులు కలిసి మెదక్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు బేళా నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పారు. 2019లో ఆ కాంట్రాక్టర్ కబేళా కోసం తన సొంత ఖర్చులతో ఏడుపాయల్లో ఓ బిల్డింగ్ నిర్మించారు. ఒక మూగ జీవం కట్ చేయడానికి రూ.25 చొప్పున దేవస్థానానికి చెల్లిస్తూ ఐదేళ్లపాటు కబేళా నిర్వహించుకోవాలని ధర్మకర్తలు తీర్మానించారు. అయితే 10 కిలోల లోపు బరువు గల జీవానికి రూ.400 20 కిలోల లోపు రూ.500, 20 కిలోల పైన రూ.600 భక్తుల వద్ద నుంచి అతడు వసూలు చేసుకోవచ్చునని తీర్మానించారు.

అధిక వసూళ్లంటూ గ్రామస్థుల ఆందోళన

మేకల కట్ చేసే క్రమంలో భక్తుల నుంచి కాంట్రాక్టర్ విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నాడంటూ ఆరోపిస్తూ 31 మార్చి 2024న నాగ్సాన్‌పల్లి గ్రామస్థులు ఏడుపాయల్లో ఆందోళనకు దిగి, కబేళాకు తాళం వేసి, వారే వసూళ్లకు దిగారు. దీంతో పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ధర్మకర్తలు, మండల నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఐదేళ్లలో జీవానికి రూ.25 చొప్పున చెల్లించాల్సిన కాంట్రాక్టర్ నయాపైసా చెల్లించలేదని, నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువ వసూలు చేస్తున్నాడంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో కాంట్రాక్టర్‌ను తొలగించాలని నిర్ణయించారు. 1 ఏప్రిల్ 2024 నుంచి ఆలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో కబేళా నిర్వహిస్తున్నారు. గత తీర్మానం ప్రకారం తనకు ఇంకా 5 నెలల కాల పరిమితి ఉందంటూ సదరు కాంట్రాక్టర్ కోర్టు మెట్లు ఎక్కడం, కబేళాను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ప్రయత్నించడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఈవో క్రిష్ణప్రసాద్ పాపన్నపేట పోలీసుల సహాయంతో కబేళాకు తాళం వేశారు. ఈ విషయమై చైర్మన్ బాలాగౌడ్ మాట్లాడుతూ ఒక నెలలో సుమారు 1,500 మేకలు కోస్తారని, దానివల్ల ఆలయానికి ఎంత లేదన్నా నెలకు రూ.40 వేల ఆదాయం రావాల్సి ఉందన్నారు. ఈ లెక్కన చూస్తే కాంట్రాక్టర్ నిర్వహించిన 54 నెలలకు సుమారు రూ.20 లక్షల ఆదాయం రావాల్సి ఉందన్నారు. అలాగే నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువ ధరలు వసూలు చేసి భక్తులను దోపిడీ చేయడంతో ధర్మకర్తలు, అధికారుల తీర్మానం మేరకు కబేళా కాంట్రాక్టర్‌ను తొలగించామన్నారు. ఈవో క్రిష్ణప్రసాద్ మాట్లాడుతూ వివాదం కోర్టు వరకు వెళ్లడంతో పాటు కొన్నిరోజులగా కబేళా వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనడంతో కబేలా మూసివేశామని తెలిపారు.

రుణమాఫీ డబ్బులతో బలవంతంగా డిపాజిట్లు

● కొమురవెల్లి ఏపీజీవీబీ ఎదుట సీపీఎం ధర్నా



కొమురవెల్లి ఏపీజీవీబీ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, జూలై 23: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పంట రుణమాఫీ చేస్తుండగా, రెన్యూవల్ పేరిట బ్యాంకు అధికారులు బలవంతంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించుకుంటుండటంతో ఉసూరుమంటున్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలోని ఏపీజీవీబీ అధికారులు పలువురు రైతుల నుంచి ఒక సంవత్సరం కాలపరిమితితో కూడిన డిపాజిట్లు చేయించడం వివాదాస్పదమవుతుంది. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తూ బ్యాంకు అధికారులు బలవంతంగా డిపాజిట్లు చేయించుకోవడం తగదని మండిపడుతూ సీపీఎం నాయకులు మంగళవారం బ్యాంకు ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ విషయమై పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ ఏపీజీవీబీ అధికారులు ఏ ప్రాతిపదికన బలవంతపు డిపాజిట్లు చేయించుకుంటున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత లక్ష్యాల కోసం రైతులను ఇబ్బందులకు గురిచేయిడడం తగదని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ చేసి రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడూరి రవీందర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, బక్కెల్లి బాలకిషన్, తాడూరి మల్లేశం, ఉల్లంపల్లి సాయిలు, నీల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదికి తప్పనిసరి వస్తారని డిపాజిట్లు చేయిస్తున్నాం: ఇంచార్జి మేనేజర్ నరేశ్

డిపాజిట్ ఉంటే రైతులు ఆ డబ్బుల కోసం ప్రతీ ఏడాది విధిగా రెన్యూవల్ చేసుకోవడంతో పాటు అధిక వడ్డీ పడకుండా ఉంటుందని డిపాజిట్లు చేయించాం. బ్యాంకు రైతుల బాగుకోసమే ఆలోచిస్తుంది. సీపీఎం నాయకులు ధర్నా చేసినప్పటికీ ముగ్గురు డిపాజిట్ చేయించుకున్నారు. మేము ఎవరినీ బలవంతం చేయడం లేదు.






సంగారెడ్డిలో బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, అమ్మవారికి బలి కోసం తీసుకెళ్తున్న గొర్రె పొట్టేళ్లు, జోగిపేటలో బోనాల పండుగలో పోతరాజుల విన్యాసాలు, వట్‌పల్లి మండలం మర్వెల్లిలో బోనాలతో ఊరేగింపు

కనుల పండువగా ఆషాఢ బోనాలు



సంగారెడ్డిలో బోనాల ఊరేగింపులో జోగిని శ్యామల విన్యాసాలు





గుమ్మడిదల ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు, ఎడ్లబండ్లతో ఊరేగింపు, పెద్దశంకరంపేటలో బోనాలతో ఊరేగింపు

- **సంగారెడ్డిలో ప్రత్యేక ఆకర్షణగా జోగిని శ్యామల విన్యాసాలు**
- **పలుచోట్ల ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల శిగాలు**
- **బోనాల ఊరేగింపులతో ఆషాఢశోభ**

సంగారెడ్డి రూరల్, జూలై 23: ఆషాఢమాసం సందర్భంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో గౌడసంఘం అధ్వర్యంలో మంగళవారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. బోనాలతో పట్టణం శివారులోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి ప్రధానరహదారి మీదుగా అస్తబల్ (ఎఫ్‌ఆర్‌ఎస్) వరకు గౌడ కులస్థులు, మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. బోనాల మహోత్సవంలో జోగిని శ్యామల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జోగిని శ్యామల నెత్తిన బోనం ఎత్తుకుని విన్యాసాలు చేయడం పలువురిని ఆకర్షించింది. అదే విధంగా పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపునకు ఊపునిచ్చారు. బోనాల ఊరేగింపు సమయంలో మహిళలు అమ్మవారికి నీటితో శాకపట్టి మంగళహారతులు అందజేసి ఆశీర్వచనాలు పొందారు. అస్తబల్‌లోని రేణుక ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజుగౌడ్, కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్న గౌడ్, రమేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

అందోలు-జోగిపేటలో..

జోగిపేట, జూలై23: అందోలు, జోగిపేట జంట పట్టణాల్లో మంగళవారం ఆషాఢ బోనాల పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం అందోలు పట్టణంతో పాటు, జోగిపేటలోని తూర్పుగౌని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మహిళలు వేర్వేరుగా బోనాల పండుగను నిర్వహించారు. ఇండ్ల నుంచి బోనాలను ఎత్తుకుని, బాజాభజంత్రీల చప్పుళ్ళు, శివసత్తుల హోరు మధ్య భారీ ఊరేగింపు నిర్వహించి పోచమ్మ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేపట్టి, అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. ఇదిలా ఉంటే, అందోలు పట్టణంలో నిర్వహించిన బోనాల పండు గలో టీఎస్‌టీపీసీ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి మహిళలతో కలిసి ఆయన బోనమెత్తుకుని పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ హెచ్. రామాగౌడ్, కౌన్సిలర్లు చిట్టిబాబు, భవానీ గౌడ్, కోఆప్షన్ సభ్యుడు శ్రీకాంత్,నాయకులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో ఎడ్లబండ్లతో ఊరేగింపు

గుమ్మడిదల, జులై 23 : మండల కేంద్రంలో ఆషాఢ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఎల్లమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా గుమ్మడిదల లోని ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం పోచమ్మకు సమర్పించిన బోనాలను తిరిగి మంగళవారం ఎల్లమ్మ ఆలయ ఆవరణలో మహిళలు వండి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి ఎల్లమ్మ తల్లికి బోనాల సమర్పించుకున్నారు. ఎల్లమ్మ తల్లి అలంకరణతో ఆలయంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా గ్రామ ప్రజల సమక్షంలో బొడ్రాయి వద్ద ఏర్పాటుచేసిన ఎడ్ల బండ్లు, పలహార బండ్లను డప్పు చప్పుళ్లతో భారీ ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. పోతురాజు విన్యాసాలు పిల్లలను పెద్దలను ఉత్సాహపరిచింది. ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేసిన రైతుల ఎడ్లబండ్లకు ఆలయ కమిటీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ పడమటి లక్ష్మారెడ్డి, పాలకవర్గ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

మర్వెల్లిలో..

వట్‌పల్లి జూలై 23: మండల పరిధిలోని మర్వెల్లి గ్రామంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ మాతకు భక్తులు ఘనంగా బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తులు నృత్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, జూలై 23: మండలకేంద్రంలోని రేణుకాఎల్లమ్మవారికి మంగళవారం మహిళలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రియాంక కాలనీవాసులతో పాటు పెద్దశంకరంపేటలోని పట్టణ పురవీధుల గుండా బాజాభజంత్రీలతో, శివసత్తుల నృత్యాలతో, మహిళలు బోనాలు నెత్తినపెట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఉదయం ఆలయంలో మహిళలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

రైతు బీమా పథకాన్ని దరఖాస్తు చేసుకోవాలి



వెంకటేశం, ఏవో

నాగల్‌గిద్ద, జూలై 23: రైతులు రైతు బీమా కోసం ఆగస్టు 5లోపు దరఖాస్తు చేసుకోవాలని నాగల్‌గిద్ద మండల ఏవో వెంకటేశం పేర్కొన్నారు. మంగళవారం నాగల్‌గిద్ద వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు బీమా కోసం జూన్ 28వ తేదీ నాటికి రిజిష్ట్రేషన్ అయిన వారి డేటా ధరణి పోర్టల్ నుంచి వ్యవసాయశాఖకు అందించినట్టు తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల లోపు వారు సమీప క్లస్టర్, వ్యవసాయ విస్తరణ అధికారి రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో క్లస్టర్ పరిధిలోని ఏఈవోలు మహిపాల్, నగేష్, సంతోష్, సావిత్రి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

యావాపూర్ కుంటకు హద్దులు ఏర్పాటు చేయాలి

తూప్రాన్, జూలై 23: మండలంలోని యావాపూర్ శివారులోని సూర్దమ్మ (కుమ్మరి) కుంటహద్దులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డికి విజ్ఞప్తి చేశారు. యావాపూర్ సూర్దమ్మకుంటకు సర్వేనంబరు 195లో శిఖం గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. కుంట ఆక్రమణ జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరారు.

ఫిట్స్‌తో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహం

మాసాయి పేట, జూలై 23: మాసాయిపేట మండలం వడ్డెర కాలనీ కంకర మిషన్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి ఫిట్స్‌తో డివైడర్‌పై పడి స్పృహ తప్పడంతో గాంధీ ఆసుపత్రికి తరలించామని చేగుంట పోలీసులు తెలిపారు. చికిత్స పొందుతూ సదరు వ్యక్తి మంగళవారం మృతి చెందాడన్నారు. ఆచూకీ తెలిసినవారు చేగుంట పోలీసులకు సమాచారం అందించాలని చేగుంట ఎస్‌ఐ బాలరాజు ఈ సందర్భంగా సూచించారు.

12వ రోజుకు రైతుల రిలే దీక్షలు

నర్సాపూర్, జూలై 23: సంగారెడ్డి కెనాల్‌ను వ్యతిరేకిస్తూ చేపట్టిన రైతుల రిలే నిరాహార దీక్ష మంగళవారం 12వ రోజుకు చేరింది. దీక్షలో రైతులు కొండల్, నర్సింహారెడ్డి, పోచయ్య, శేఖగౌడ్, సుధాకర్‌రెడ్డి, రాజమౌళి,మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. 12రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు ఎవరు స్పందించకపోవడం విచాకరమని ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న రైతులు పేర్కొన్నారు. అధికారులు హామీ ఇచ్చేవరకూ దీక్ష కొనసాగిస్తామన్నారు.

ముమ్మరంగా రైసుమిల్లుల తనిఖీ

ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు మంగళవారం మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో అధికారులు రైస్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వ, సీఎంఆర్ బియ్యం నిల్వలను తనిఖీ చేశారు.



నర్సాపూర్‌లో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్సు అధికారులు

నర్సాపూర్, జూలై 23: నర్సాపూర్ మండలంలోని పలు రైసుమిల్లులను మంగళవారం టాస్క్‌ఫోర్సు అధికారుల బృందం తనిఖీ చేసింది. జిల్లా పౌరసరఫరాల అధికారి హరికృష్ణ, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డితో కూడిన అధికారుల బృందం మండలంలోని లింగాపూర్, నర్సాపూర్, రెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో మిల్లులను తనిఖీ చేసి ధాన్యం నిల్వలతో పాటు రికార్డులను పరిశీలించారు.

- చేగుంట: నార్సింగి మండలంలోని రైస్ మిల్లులను తహసీల్దార్ షేక్ కరీం ఆధ్వర్యంలో ఎస్‌ఐ అహ్మద్ మోహియుద్దీన్, ఎంపీడీవో చిన్నారెడ్డి తదితరులు మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వ, సీఎంఆర్ బియ్యం నిల్వలను తనిఖీ చేసి, రైస్ మిల్లుల్లో రిజిష్టర్లను పరిశీలించినట్టు తెలిపారు. తనిఖీల్లో ఆర్‌ఐ నవీన్‌రావు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- పెద్దశంకరంపేట: మండలంలోని పలు రైస్‌మిల్లులను తహసీల్దార్ గ్రేస్‌బాయ్, రేగోడు తహసీల్దార్ బాలలక్ష్మి, టేక్మాల్ తహసీల్దార్ క్రిష్ణ, ఆర్‌ఐ. శర్ణప్ప, ఎస్‌ఐ శంకర్ పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, దాన్యం నిల్వలను పరిశీలించారు.
- రామాయంపేట: మండల పరిధిలోని అక్కన్నపేట భద్రకాళీ రైస్‌మిల్లులో మంగళవారం జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు నేతృత్వంలో తహసీల్దార్ రజని తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిల్వ ఉంచిన బియ్యం, వడ్ల నిల్వలను పరిశీలించారు.
- వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శివసాయి రైస్‌మిల్లును మంగళవారం తహసీల్దార్ తులసీరామ్ తనిఖీ చేశారు. ప్రభుత్వం రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం విలువ, సీఎంఆర్ బియ్యం రికార్డులను పరిశీలించారు. 2027 ధాన్యం బ్యాగులు వ్యత్యాసాన్ని గుర్తించినట్లు తహసీల్దార్ తులసీరామ్ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ నవత, ఇన్‌చార్జి ఎంపీడీవో విఘ్నేశ్వర్, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.
- శివ్వంపేట: మండల కేంద్రంలోని ఓం సాయి బాయిలర్ రైస్ మిల్లును సివిల్ సప్లై డీఎం హరికృష్ణ, ఆర్డీవో జగదీశ్వర్ ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం వేర్వేరుగా ఆకస్మిక తనిఖీ చేసి రైస్‌మిల్లులో స్టాక్ రికార్డులను పరిశీలించి నిలువలను తనిఖీ చేశారు. తనిఖీల్లో తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, డిప్యూటీ తహసీల్దార్ షఫియోద్దీన్, ఎంపీడీవో నాగేశ్వర్ ఉన్నారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి



చేగుంట: రోడ్డుపై బైఠాయించిన దివ్యాంగుల

కల్హేర్, జూలై 23; ఐఏఎస్ ఉద్యోగాల భర్తీలో దివ్యాంగుల రిజర్వేషన్ల పట్ల అనుచిత వాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక(ఎన్‌పీఆర్డీ) మండల అధ్యక్షుడు సంగమేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం కల్హేర్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ అంజయ్యకు ఆమెపై ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుచూ ఆమె దివ్యాంగులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం బాధ్యులు సాయిలు, నితిన్ ఉన్నారు.

- నారాయణఖేడ్: ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ దివ్యాంగులను అవమానించేలా చేసిన ట్వీట్ దారుణమని ఖేడ్‌నియోజకవర్గ బీమ్ ఆర్మీ అధ్యక్షులు అనుములతుకారం అన్నారు. వెంటనే దివ్యాంగులకు స్మిత సబర్వాల్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.
- మెదక్ కల్చరల్: ఈ నెల 21న దివ్యాంగులను కించపరిచే విధంగా ట్వీట్ చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని జాతీయ వికలాంగుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గౌతమ్, ఎర్రదాసు, శివకుమార్, రాజశేఖర్, యాదగిరి, ఎండీ నహీం, మహిళా సంఘం అధ్యక్షురాలు గీత పాల్గొన్నారు.
- చేగుంట: సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులను కించపరిచే విధంగా చేసిన ట్వీట్‌కు నిరసనగా మండలంలోని పులిమామిడి చౌరస్తాలో దౌల్తాబాద్, గజ్వేల్ రహదారిపై మంగళవారం దివ్యాంగులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భగా దివ్యాంగుల మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మాదాపూరం గౌతమ్ మాట్లాడుతూ ఆమె చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని దివ్యాంగుల సమాజానికి క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో చేగుంట మండలం దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు నెల్లూరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ముత్యాలు, కార్యదర్శి కురుమ చంద్రం,కోశాధికారి నవీన్ పాల్గొన్నారు.

అల్లం రైతుల్లో ఆందోళన వద్దు



హోతి(కే)లో అల్లంపంటను పరిశీలిస్తున్న రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అదనపు డైరెక్టర్ రవికుమార్

జహీరాబాద్, జూలై 23: కేరళకు చెందిన లేతరకం అల్లం హైదరాబాద్‌లోని ఆయా మార్కెట్లకు రాకుండా చూస్తామని, అల్లం రైతులు ఆందోళన చెందొద్దని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో అల్లం రైతులతో సమావేశం నిర్వహించారు. స్థానిక అల్లం రైతులు మాట్లాడుతూ.. కేరళ నుంచి లేతరకం అల్లం హైదరాబాద్ మార్కెట్‌కు రావడంతో నాణ్యమైన తమ అల్లంకు ధర లేక డిమాండ్ తగ్గిందన్నారు. స్పందించిన ఆయన కేరళ అల్లం రాకుండా చూస్తామన్నారు. అనంతరం హోతి(కే) గ్రామంలో రైతులు పండిస్తున్న అల్లం పంటను పరిశీలించారు.కార్యక్రమంలో జహీరాబాద్, మలకపేట మార్కెట్ కార్యదర్శులు రైతులు పాల్గొన్నారు.



గొల్లపల్లి పల్లె దవాఖానాలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చేగుంట, జూలై 23: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అన్నారు. మండలంలోని జైత్రంతండా పరిధిలోని తండాల్లో పలువురు డెంగీ లక్షణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్న సమాచారం మేరకు మంగళవారం జిల్లా మలేరియా అధికారి నవీన్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండావాసులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టి జ్వరాలు వచ్చినవారి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించాలని తెలిపారు. వైద్యులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంల ద్వారా సమాచారాన్ని సేకరించాలన్నారు. అనంతరం గొల్లపల్లిలోని పల్లె దవాఖానాను సందర్శించి, రికార్డులను పరిశీలించారు.

రైతుల ఖాతాల్లో రూ.237.5 కోట్లు జమ

- **మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్**



మెదక్ అర్బన్, జూలై 23: మెదక్ జిల్లా వ్యాప్తంగా మొదటి విడతగా రూ. లక్షలోపు పంట రుణం కల్గిన 47,616 మంది రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు రూ. 237.5 కోట్లు వివిధ బ్యాంకుల ద్వారా జమ చేసినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల 362మంది రైతులకు సంబంధించిన రూ.13 కోట్లను జమ చేయాల్సి ఉందన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో నగదు అందే విధంగా చర్యలు చేపడుతామని ఆయన వెల్లడించారు.

జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ధర్మేంద్ర బదిలీ

సంగారెడ్డి అర్బన్, జూలై 23: సంగారెడ్డి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి(ఫుడ్ ఇన్‌స్పెక్టర్) ధర్మేంద్ర బదిలీ అయ్యారు. యాదాద్రిభువనగిరి జిల్లాకు ఆయన జిల్లా అధికారిగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాకు జిల్లా అధికారితో పాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇలాకాలో ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించకపోవడం గమనార్హం. కాగా వరంగల్ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా(ఏఎఫ్‌సీ)పనిచేస్తున్న అమృత ఉమ్మడి మెదక్ జిల్లాకు ఏఎఫ్‌సీగా నియమితులయ్యారు. నేడో రేపో ఆమె విధుల్లో చేరనున్నారు.

జిల్లా యువజన క్రీడల అధికారిగా ఖాసీంబేగ్



సంగారెడ్డి అర్బన్, జూలై 23 : జిల్లా యువజన క్రీడలశాఖ అధికారిగా(డీవైఎస్‌వో) మొగల్ ఖాసీంబేగ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని యువజన సర్వీసుల ప్రధాన కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు మంగళవారం డీవైఎస్‌వోగా ఖాసీంబేగ్ బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇక్కడ డీవైఎస్‌వోగా పనిచేసిన రాంచందర్‌రావు సూర్యాపేట జిల్లాకు బదిలీ అయ్యారు.

మండలంలో పర్యటించిన క్రికెటర్

హత్నూర, జూలై 23: ఇండియన్ క్రికెటర్ నాగేందర్ మంగళవారం మండలంలో పర్యటించినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. జిల్లా ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్ రంజీ క్రికెటర్ నాగేందర్ మండల కేంద్రమైన హత్నూర ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దత్తాచల క్షేత్రం పరిశీలించారు. ఎంపీడీవో శంకర్, ఎంపీవో సువర్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆయనతో పాటు ఉన్నారు.

మోదీ నాయకత్వంలో అన్నిరంగాల్లో దేశాభివృద్ధి

- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కరణం పరిణిత**

పెద్దశంకరంపేట/పాపన్నపేట, జూలై 23: మోదీ నాయకత్వంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కరణం పరిణిత పేర్కొన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల బీజేపీనాయకులు బండాల శ్రావణ్‌కుమార్,మంగలి కృష్ణ, బుగుడాల కృష్ణ, ఆయా గ్రామాల బూత్ స్థాయి అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా పాపన్నపేటలో బీజేపీ అధ్యక్షుడు కొండ రాములు అధ్యక్షతన కార్యకర్తల మండల విస్తృతస్థాయి సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కరణం పరిణిత హాజరై మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా వర్తింప చేయాలన్నారు. సమావేశంలో మండల అభివృద్ధి అంశాలపై పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు భైండ్ల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

మనోహరాబాద్, జూలై 81: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పరును రెవెన్యూ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి టిప్పర్‌ను పోలీసులకు అప్పగించారు.

'రైతు నేస్తం'లో పత్తిపంటపై అవగాహన

మనోహరాబాద్ జూలై 23: మనోహరాబాద్ మండల కేంద్రంలో మంగళవారం రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం ఏవో స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పత్తి పంటలకు రోగాలు రాకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఏడీఏ సధ్యారాణి, ఏవో స్రవంతి , ఏఈవోలు సచిన్, నరేందర్, రైతులు పాల్గొన్నారు.

జానీ నార్కోటిక్ డాగ్‌తో వాహన తనిఖీలు

సంగారెడ్డి క్రైం, జూలై 23: సంగారెడ్డి రూరల్ పోలీసులు సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్‌వాది ఎంఎన్‌ఆర్ చౌరస్తాలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. జానీ నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్టు రూరల్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ రూపేష్

సంగారెడ్డి అర్బన్, జూలై 23: విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్‌లో టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన 28 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వీరిని జిల్లా ఎస్పీ రూపేష్ మంగళవారం అభినందించి మాట్లాడారు. మహిళలకు ఆత్మరక్షణ విద్య చాలా అవసరమన్నారు. అండర్ 9 స్పారింగ్ విభాగంలో రిత్విక్, హాసిని, సాహితి, భవజ్ఞ, అద్విక్‌మాథ్యూ, రితిక, అండర్ 12 లో సాయి చరణ్, విశ్వేశ్వర్, భరణి కార్తిక్, ప్రణవ్ సాయి, హరిణ్య పాటిల్, శివ తేజ, శ్రీహర్షిత, రఘువంశీ, మహేశ్‌కుమార్, శ్రీమాన్విక్, అమోఘ్, సుశాంత్, రుషి వర్ధన్‌లు బంగారు, వెండి, కాంస్య పథకాలను సాధించారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ కోచ్, వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ పోచయ్య, మాస్టర్లు మహేశ్‌గౌడ్, రాజు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాలల్లో పనులు సకాలంలో పూర్తి చేయాలి

సంగారెడ్డి అర్బన్, జూలై 23 : పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవో వెంకటేశ్వర్లు ఆదేశించారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో మంగళవారం మండలాల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో ఆయన జిల్లా స్థాయి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన అన్ని పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ చైతన్య కార్యక్రమంలో భాగంగా ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సమగ్ర శిక్షా కో ఆర్డినేటర్లు వెంకటేశం, అనురాధ, తాజొద్దిన్, రోజారాణి, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 16 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు పదోన్నతులు

సంగారెడ్డి క్రైం, జూలై 23: సంగారెడ్డి జిల్లాలో 16మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.జగదీశ్వరయ్య (జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్), ఎ.నరేందర్‌రావు ట్రాన్స్‌కో, రాజేశ్వర్(రాయికోడ్), ఎం.అశోక్(పటాన్ చెరు), బి.భూమయ్య (నాగల్‌గిద్ద), ఎ.రామస్వామి(జహీరాబాద్ టౌన్), కె.జంగయ్య (జహీరాబాద్ రూరల్), టి.లక్ష్మారెడ్డి (సంగారెడ్డి స్పెషల్ బ్రాంచ్), ఇ.హనుమాన్‌గౌడ్ (సంగారెడ్డి ట్రాఫిక్), సీహెచ్. ప్రసాద్(జిన్నారం), ఎం.అర్జున్ (ఝరాసంగం), ఎస్.ప్రభాకర్‌రావు (పటాన్‌చెరు ట్రాఫిక్), కె.మధుసూదన్‌రెడ్డి (ఇంటెలిజెన్స్), డి.కేశయ్య (జోగిపేట), ప్రకాష్‌రావు (కంగ్టి), సి.విల్సిమ్ కెన్నెల్కర్ (హత్నూర) ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

ప్రైవేటు లేఅవుట్‌కు నిధులు కావాలనడం సిగ్గుచేటు

పటాన్‌చెరు, జూలై 23: పటాన్‌చెరు పట్టణంలోని బిల్డర్ల ఆధీనంలో ఉన్న ప్రైవేటు లేఅవుట్‌కు మంచినీటి పైపులైన్ల కోసం నిధులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ ప్రతిపాదనలు పంపడం సిగ్గుచేటని కాంగ్రెస్ పట్టణ నాయకులు విమర్శించారు. పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు మతిన్, అతిక్ తదితరులతో కలిసి కార్పొరేటర్ ఆరోపణలను ఖండించారు. పట్టణంలోని సీతారామాపురం లేఅవుట్‌లో వేసిన వ్యాపారులకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ఉండగా జీహెచ్‌ఎంసీ, మెట్రోవాటర్ వర్క్స్ నుంచి రూ.45లక్షలతో మంచినీటి పైపులైను వేసేందుకు కార్పొరేటర్ ప్రతిపాదనలు తయారు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పైగా మెట్రోవాటర్ వర్క్స్ ఎండీ నిధులు లేవని చెప్పినట్లు దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మౌళిక వసతుల కోసం సీఎం 10కోట్లు మంజూరు చేశారన్నారు.

జిల్లా కోర్టులో ఉచిత దంత వైద్య శిబిరం



న్యాయవాదులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శిల్ప

సంగారెడ్డి క్రైం, జూలై 23: సంగారెడ్డిలోని జిల్లా కోర్టులో మంగళవారం నాడు న్యాయవాదులకు ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సంగారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో న్యాయవాదులకు దంత వైద్యులు డాక్టర్ శిల్ప తదితరులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు సూర్‌రెడ్డి, అంబరీష్, రమేష్, అశోక్, ఆంజనేయులు, లలిత, మాధవి, వీరమహేందర్, నిజామొద్దిన్, జ్ఞానోబా, పెంటయ్య రమాదేవి, వినోద్ కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారంలో లక్ష్యాన్ని అందుకోవాలి: డీఆర్డీవో

అల్లాదుర్గం, జూలై 23: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలాలకు నిర్దేశించిన లక్ష్యాన్ని వారం రోజుల్లో పూర్తి చేయాలని డీఆర్డీవో శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని చిల్వర్ గ్రామంలో నిర్వహించిన వనమహోత్సవలో ఆయనతో పాటు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్.ఐ ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీవో శంకర్‌యాదవ్, తహసీల్దార్ సతీష్ కుమార్, ఈజీఎస్ ఏపీవో సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి తదితరులతో కలసి మొక్కలను నాటారు. అనంతరం మండలంలోని ముప్పారంలో జరుగుతున్న ఉపాధి పనులను, అల్లాదుర్గంలో నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈజీఎస్, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, నాయకులు నర్సింహరెడ్డి, జైపాల్, అంజాగౌడ్, మధుసూదన్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాభూమిలో అడ్డుపడుతున్నవారిపై చర్యలు తీసుకోండి

- **శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితుడి ఆందోళన**

శివ్వంపేట, జూలై 23: తమ పట్టా భూమిని కొందరు అక్రమంగా రికార్డులు మార్చి పట్టా చేయించుకుని అడ్డుపడుతున్నారని, వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ మంగళవారం బిజిలిపూర్‌కు చెందిన అసలు పట్టాదారు ఎండీ అఫ్జల్ గ్రామస్థులతో కలిసి మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని బిజిలీపూర్ గ్రామంలో సర్వేనంబర్ 88/2లో ఎండీ హుస్సేన్‌కు 1 ఎకరా 14 గుంటల పట్టా భూమి ఉంది. ఆ భూమిని హుస్సేన్ కొడుకు అఫ్జల్ తమ పేర రిజిస్ట్రేషన్ చేసుకుని హైదరాబాద్‌కు చెందిన మాధవరెడ్డికి 2023 జనవరిలో విక్రయించారు. ఆ భూమిలో కొందరు వ్యక్తులు అడ్డు రావడంతో భూమిని కొనుగోలు చేసిన మాధవరెడ్డి కోర్టును ఆశ్రయించాడు. కోర్టు తీర్పు మాధవరెడ్డి అనుకూలంగా ఇవ్వడంతో అట్టి భూమిలో ప్రభుత్వ సర్వే నిర్వహించారు. కాగా కొందరు వ్యక్తులు రికార్డులు మార్చి భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్నారని, తమపై పత్రికల్లో అసత్యప్రచారాలు చేయించారని అఫ్జల్, మాధవరెడ్డి ఆరోపించారు. అసత్యపు ఆరోపణలు చేస్తున్న వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసాచారి సంప్రదించగా భూమికి సంబంధించిన అసలైన పట్టాదారు అఫ్జల్ అని స్పష్టం చేశారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

సంగారెడ్డి అర్బన్, జూలై 23: భారతీయ మజ్దూర్ సంఘ్ 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయం వద్ద బీఎంఎస్ జెండాను జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అన్ని కార్మిక సంఘాలు తమ మనుగడ కోసం పనిచేస్తాయని, బీఎంఎస్ మాత్రం కార్మిక సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, అంజయ్య, రాజయ్య, వేణుమాధవ్‌రెడ్డి, మహేందర్, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కోహీర్: మండలంలోని వెంకటాపూర్ పరిధిలో గల గ్లోబల్ గ్రీన్ పరిశ్రమ వద్ద బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ కార్మిక సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ బీఎంఎస్ కార్మిక సంఘం కార్మికుల శ్రేయస్సుతోపాటు దేశ శ్రేయస్సును కూడా కోరుతుందన్నారు. అనంతర పరిశ్రమ వద్ద జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లేశం, మల్లారెడ్డి, రవీందర్‌నాథ్, వీరశెట్టి, భాష, మొగులయ్య, కృష్ణయ్య, లక్ష్మ, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.